క్లుప్తంగా

దరఖాస్తులు అందించాలి

కూసుమంచి: రాజీవ్ యువ వికాసం పథకం కోసం మండల వ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం నాటికి 4,469 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. 3,656 మంది ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారు బుధవారం నాటికి తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

సాహితీవేత్తకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంగాంధీ చౌక్: ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన సాహితీవేత్త బుక్క సత్యనారాయణను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం సత్కరించారు. కవి, రచయితగానే కాక సాహితీవేత్తగా ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీ కొనియాడారు. ఇటీవల హైదరాబాద్‌లో నంది అవార్డు స్వీకరించడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పారా నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, కేదాసు నరసయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి డాక్టర్‌కు స్వాగత సన్మానం



వనజ, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తికి చెందిన మార్కపూడి వనజ ఓయూ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పట్టా అందుకోగా.. ఈ గ్రామంలో వైద్యవిద్య పూర్తిచేసిన తొలి యువతిగా ఘనత సాధించింది. ఈసందర్భంగా పట్టా అందుకున్నాక మొదటిసారి మంగళవారం గ్రామానికి రాగా ఆమెతో పాటు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు – నిర్మలను సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు తమ్మిన నాగేశ్వరరావు ఆధ్వర్యాన సన్మానించగా, వైద్యరంగంలో గ్రామస్తులకు సేవలందించాలని ఆకాంక్షించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని పాలేరు ఏటి నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. బచ్చోడు వద్ద చేపట్టిన తనిఖీల్లో ట్రాక్టర్ పట్టుబడగా, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీఐఎఫ్ సహకార కేంద్రంగా కమల హాస్పిటల్



గుర్తింపు పత్రంతో ఆస్పత్రి బాధ్యులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని కమల హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ తలసేమియా, సికిల్‌సెల్.. టీఐఎఫ్(తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్) సహకార కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ విషయాన్ని ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు వెల్లడించారు. ఈ గుర్తింపు ద్వారా తలసేమియా, సికిల్ సెల్‌తో పాటు హిమోగ్లోబినోపతి రంగంలో సంరక్షణ, విద్య, పరిశోధనల పెంపులో భాగమవుతామని తెలిపారు. టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మం లీగల్: ఇటీవల నగరానికి చెందిన న్యాయవాది గురిజాల నాగేంద్ర మృతిచెందగా.. మంగళవారం బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప సభ ఏర్పాటు చేసి సంతాపం ప్రకటించారు. అనంతరం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. బార్ ఉపాధ్యక్షురాలు విజయశాంత, కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	40		20
కాకర	36	చుక్కకూర	4
బీట్‌రూట్	22		20
బీర	60	తోటకూర	4
దొండ	18		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

‘కల్తీ’ దందా..!



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ దాబా





నిల్వ చికెన్‌తో చేసిన ఫ్రై..

దాబాల్లో పాడైన ఆహారం వడ్డింపు

- లాభార్జనే ధ్యేయంగా నిర్వాహకుల తీరు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారన్న ఆరోపణలు
- అనారోగ్యం ‘కొని’తెచ్చుకుంటున్న కస్టమర్లు

ఖమ్మంరూరల్: చికెన్ బిర్యానీ, ధమ్ బిర్యానీ, చికెన్ సిక్స్టీఫైవ్, సిక్స్టీఫైవ్, చికెన్ రోస్ట్ విత్ రోటీ, చికెన్ మంచూరియా ఇలా రకరకాల పేర్లతో వినియోగదారులు, మాంసంప్రియులను ఆకర్షిస్తూ పలువురు దాబాలు నడిపిస్తున్నారు. అంతేకాక ఫ్యామిలీ దాబాల పేర్లతో నిల్వ ఆహార పదార్థాలను వడ్డిస్తూ దాబాల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆయా దాబాల్లో ప్రతి రోజూ ఏఏ వంటకాలు చేస్తున్నారు, వంటకాలు ఎప్పుడు తెచ్చారు అనేది బహిరంగంగా వినియోగదారులకు బోర్డుపై ప్రదర్శించాలి. ఇవేమీ పట్టించుకోకుండా లాభార్జనే ధ్యేయంగా యజమానులు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి.

నియంత్రణ కరువు..

జిల్లాలో దాదాపు 1,500కు పైగా వివిధ రకాల పేర్లతో దాబాలు వెలిశాయి. అందులో ఫ్యామిలీ దాబాలే ఎక్కువగా ఉన్నాయి. ఒకేసారి చికెన్, చేపలు, రొయ్యలు లాంటి మాంసహారాలు తెచ్చి ఫ్రిజ్‌లలో నిల్వ చేయడం, వాటినే డీఫ్రిజ్ చేసి తిరిగి ఫ్రై చేసి వచ్చిన వారికి వడ్డించడం నిత్యకృత్యమైంది. ఏరోజు కారోజు తీసుకురావాల్సిన మాంసాహారాలను ఇలా నిల్వ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. కుళ్లిపోయిన ఆహారాలను తిని అనారోగ్యాలపాలతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా ఉండడంతో తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా విస్తరింపజేసుకుంటున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు..

ఇదిలా ఉండగా జిల్లాలో ఒక దాబాలే కాదు చిన్న, మధ్య హోటళ్ల వద్ద నుంచి స్టార్ హోటళ్ల వరకు ఇలాంటి నాణ్యతలేని ఆహార పదార్థాలు తయారు చేస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు. అయినా జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై జిల్లాలో ఏదో ఒక ప్రాంతం నుంచి ప్రతి రోజూ సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తున్నా.. వారు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

నిబంధనలు పాటించాల్సిందే..

దాబాలు, హోటళ్లలో నిబంధనలు పాటించాల్సిందే. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే 36 మందిపై కేసులు నమోదు చేశాం. ఇటీవల జరిగిన కల్తీ ఫుడ్‌పై కస్టమర్ నాకు ఫోన్ చేసిన విషయం వాస్తమే. హైదరాబాద్ నుంచి వచ్చాక విచారిస్తాం.

– కిరణ్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అడ్డగోలుగా వ్యాపారం..

ఇదిలా ఉండగా ఖమ్మంరూరల్ మండలం కోదాడ క్రాస్‌రోడ్‌లో గల వెజ్ అండ్ నాన్ వెజ్ ఫ్యామిలీ దాబాలో ఇటీవల ఓ కస్టమర్ చికెన్ మంచూరియా ఆర్డర్ చేశాడు. ఆర్డర్ వచ్చాక తింటే ఒక్కసారిగా దుర్వాసనతో వాంతులయ్యాయి. దీంతో దాబా నిర్వాహకులకు తెలుపగా అలాంటిదేమీ లేదని దబాయించే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో వంట మాస్టర్‌నే తినాలని అడగ్గా ఇది దుర్వాసన వస్తోందని చెప్పినట్లు తెలిసింది. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఇలా అధికారులు పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. కాగా, ఆ కస్టమర్ దాబా యజమానిని ప్రశ్నించగా.. నన్నే ప్రశ్నిస్తావా అంటూ పక్కనే ఉన్న రూరల్ పోలీసులకు ఫోన్ చేసి ఇక్కడ ఓ వ్యక్తి తాగి గొడవ చేస్తున్నాడంటూ సమాచారం చెప్పగా.. అతడి బైక్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం గమనార్హం. మరుసటి రోజు బాధితుడు వెళ్లగా.. బైక్ తిరిగి ఇచ్చేశారు. ఇందులో ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. గతంలో కూడా కోదాడ క్రాస్‌రోడ్, ఏదులాపురం క్రాస్‌రోడ్, వరంగల్ క్రాస్‌రోడ్, నగరంలోని శ్రీశ్రీసర్కిల్‌లో గల దాబాల్లో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం కోకొల్లలుగా జరిగాయి. అంతేకాక శ్రీశ్రీ సర్కిల్‌లో గల మండీలు, ఫ్యామిలీ దాబాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వడ్డించడం.. అప్పట్లో కస్టమర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో వాటన్నింటిని ఎలాంటి చర్యలు లేకుండానే వదిలేయడం గమనార్హం. గతంలో అనేక సార్లు ఇలాంటి సంఘటనలు జరగడం ఆ విషయాన్ని సంబంధిత అధికారులు చెప్పినా ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.

నీటి ఎద్దడి లేకుండా..

- నగరంలో తాగునీటి సరఫరాపై దృష్టి
- 90 రోజులకు సరిపడేలా ప్రణాళికలు
- లీకేజీలను అరికట్టేలా ప్రత్యేక కార్యాచరణ



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో నగరంలో నీటి ఎద్దడిపై అధికారులు దృష్టి సారించారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో నగరంలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించారు. నగరంలో 60 డివిజన్లలో ప్రస్తుతం నీటిసరఫరాపై సమీక్షించి, రాబోయే 90 రోజుల పాటు నీటి సరఫరాకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రోజువారీగా నగరంలో 69 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఇక రాబోయే రెండు నెలల్లో నీటి సరఫరాకు ఏదైనా సమస్యలు తలెత్తితే నగరంలోని వనరులను వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

75,556 నల్లా కనెక్షన్లు..

నగరంలో మంచినీటి సరఫరాకు అధికారులు 28 జోన్లుగా విభజించారు. ఇందులో 28 ఓవర్ హెడ్ ట్యాంకులు, రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఉన్నాయి. 908 కిలోమీటర్ల పైపులైన్‌తో 75,556 నల్లా కనెక్షన్లు గృహాలకు ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇందు కోసం రోజుకు 69 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తుండగా.. ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి 35 ఎంఎల్‌డీ నీరు, పాలేరు మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి 34 ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. ఇక నగరంలో నీటి సరఫరా రోజు విడిచి రోజు జరుగుతుంది.

నిరంతర పర్యవేక్షణ..

ఈ వేసవిలో నీటి సరఫరా కోసం అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆరుగురు లైన్‌మ్యాన్‌లు వారిపైన ఏఈఈలు, డీఈఈలు మంచినీటి సరఫరాను పర్యవేక్షించేలా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దాని ప్రకారం నిరంతరం లైన్లను పర్యవేక్షిస్తూ లీకేజీలను అరికట్టడం, నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవడం వంటివి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. నీటి ఎద్దడి ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపైన ముందస్తు ప్రణాళికలు చేశారు. నగరంలో ఉన్న 78 పవర్ బోర్లు, 559 చేతి పంపులను వినియోగించనున్నారు. 14 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు చేశారు.

సమస్యలు రానివ్వొద్దు..

వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. జలాశయాల్లో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. నీటిని వృథా చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రంజిత్, ఈఈ కృష్ణాలాల్, డీఈఈలు ధరణికుమార్, శ్రీనివాస్, ఏఈఈలు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం

● ‘సర్వే’ సకాలంలో పూర్తి చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మంగళవారం కేఎంసీ సమావేశ మందిరంలో రెవెన్యూ, వార్డు ఆఫీసర్లతో కమిషనర్ సమావేశమయ్యారు. లేవల్ 1 పరిశీలనను బుధవారంలోగా పూర్తి చేయాలన్నారు.

● వీధి వ్యాపారులకు జరిమానా..

నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఓ వీధి వ్యాపారికి రూ.3 వేలు జరిమానా విధించారు. రోడ్లను ఆక్రమిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● నేడు కేఎంసీకి సర్వే బృందాలు..

నగరంలో ఓడీఎఫ్ ప్లస్, గార్బేజ్ ఫ్రీ సిటీ సర్వే బృందాలు బుధవారం కేఎంసీలో పర్యటించనున్నారు. నగరంలో ఆయా బృందాలు పర్యటించి మరుగుదొడ్ల వినియోగం, వ్యర్థాల నిర్వహణను పరిశీలించి మార్కులు ఇవ్వనున్నారు.

● వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన..

నగరంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న తమకు కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని టీయూసీఐ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు జి.రామయ్య, నరేష్, విష్ణు ఆధ్వర్యాన కార్మికులు కేఎంసీ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్‌ను కలిసి విన్నవించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ మధు

● ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న పలువురికి తన సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మంగళవారం అందజేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో 65మందికి రూ.17.44 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఖమ్మం నగరం, రూరల్ మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుతో పాటు కనగాల వెంకటరావు, రావూరి శ్రీనివాసరావు, కరుమూరి వెంకటేశ్వర్లు, సామినేని హరిప్రసాద్, పోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పరామర్శ..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకోగా ఎమ్మెల్సీమధు పరామర్శించారు. అలాగే, రోడ్డు ప్రమాదానికి గురైన డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంను కూడా పరామర్శించారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్, సద్దాం పాల్గొన్నారు.

● కూసుమంచి: మండలంలోని 76 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.25.10 లక్షల చెక్కులను కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు.

నేడు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ



ఖమ్మంఅర్బన్: ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభను బుధవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం త్రీటౌన్ ఏరియాలోని బోస్ బొమ్మ సెంటర్‌లో ఉదయం 10గంటలకు సభప్రారంభవుతుందని పేర్కొన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు తదితరులు హాజరు కానున్న నేపథ్యాన సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా, శ్రీకాంత్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని మంగళవారం రాత్రి నగరంలోని ఖానాపురం, రస్తోగినగర్‌లో సీపీఎం ఆధ్వర్యాన ర్యాలీ తీశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.రమేష్, నాయకులు మంగమ్మ, దొంగల తిరుపతిరావు, రమ్య, అమరావతి, మురహరి, ప్రసాద్, రోజ, జయమ్మ, సులోచన పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులకు రైతుల అభ్యంతరం

రఘునాథపాలెం: సబ్‌స్టేషన్లలో అంతరాయం ఏర్పడితే సమీప సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ లైన్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా రఘునాథపాలెం మండలం బావోజీతండా సబ్‌స్టేషన్‌కు కూడా లైన్ వేస్తుండగా, కొందరు రైతుల అభ్యంతరంతో పనులు నిలిచిపోయాయి. నాలుగు కి.మీ. మేర లైన్ లాగేందుకు రూ.30లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. మరో పది స్తంభాల పరిధిలో వేయాల్సి ఉన్న నేపథ్యాన రైతులు అభ్యంతరం తెలిపారు. ఉన్నతాధికారులు నచ్చచెప్పినా వారు ససేమిరా అన్నట్లు తెలిసింది. దీంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామని రఘునాథపాలెం ఏడీ సంజయ్‌కుమార్ తెలిపారు.

లెక్చరర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న లెక్చరర్లు

ఖమ్మం సహకారనగర్: యూనివర్సిటీల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా పని చేస్తున్న పార్ట్‌టైమ్ లెక్చరర్లకు యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైమ్ లెక్చరర్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో చేపట్టిన నిరసనలో పీజీ, బీపీఈడీ కళాశాలకు చెందిన పార్ట్ టైమ్ అధ్యాపకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా అన్ని అర్హతలు కల్గి విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంటే యూనివర్సిటీల్లో వివక్ష కొనసాగుతోందని , దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.వీరన్న, డాక్టర్ ఎస్.రవిబాబు, రాజీవ్ రాజు, రమ, లక్ష్మీహరిత, రాణి, పేరెల్లి కోటి, పి.మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు..

నేలకొండపల్లి: ఎస్ఆర్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్, ట్రస్టు చైర్మన్ ఏటుకూరి రామారావు, ఎస్ఆర్‌ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బయ్యన్న బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమావేశం

ఖమ్మంరూరల్/ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని మామిళ్లగూడెం సాయిబాబా కార్యాలయంలో ఈనెల 17న విద్యుత్ నార్దర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కమిషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఖమ్మం సర్కిల్ పరిధిలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం జరుగుతుందని ఏదులాపురం సర్కిల్ ఏఈ ప్రభాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సదస్సులో ఎస్ఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, డివిజనల్ ఇంజనీర్స్, అకౌంట్స్ సిబ్బంది సకాలంలో హాజరై సంబంధిత సమస్యలను పరిష్కరించనున్న నేపథ్యాన వినియోగదారులు సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖమ్మంవన్‌టౌన్: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రభుత్వ పాలకవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలనేవి ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు, నాయకులు చోటా బాబా, పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్‌గౌడ్, గజ్జి సూర్యనారాయణ, యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు లకావత్ సైదులు, రాపర్తిశరత్, కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, చామకూరి వెంకటనారాయణ, ముక్తార్ జోహార, హారికా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమతంగా ఉండాలి

నేలకొండపల్లి: మానవ అక్రమ రవాణా పట్ల అప్రమతంగా ఉండాలని పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బాధ్యులు నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలో స్థానిక గౌతమ్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీస్ వ్యవస్థ అక్రమ రవాణాన్ని నిర్మూలించటానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కోప్ ఆర్గి కో–ఆర్డినేటర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు సతీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతో ఉన్నత శిఖరాలకు..



సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: విద్యార్థులు జీవన నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమవుతుందని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన మండలంలోని జల్లెపల్లి పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం, ఆచరించడాన్ని అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా ఉన్నతస్థాయి చేరొచ్చని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం దారా రాజేష్ ఉపాధ్యాయులు రామారావు, పార్థసారధి, సునీతరాణి, రంజిత్, నళిని, పుల్లయ్య, సైదులు,.రాజేశ్వరి, లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్వాసితులు, తీగల వంతెన బాధితులతో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో చర్చలు జరిపారు. అనంతరం తీగల వంతెనతో నష్టపోతున్న 100 కుటుంబాలకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం కమిటీ సభ్యుడు కళ్యాణం వెంకటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ..ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నగరంలోనే ఇంటి స్థలం ఇచ్చి నష్టపరిహారం ఇవ్వాలని, తీగల వంతెనతో చిరు షాపుల యాజమానులు నష్టపోతారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో పార్టీ త్రీటౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, ఖాసీం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఖమ్మం శాఖ ఆధ్వర్యాన డీఐఈఓరవిబాబుకు మంగళవారం వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చావా ప్రణీత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించినా వివిధ కోర్సుల పేరులో ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే దాదాపుగా పదో తరగతి అడ్మిషన్లు పూర్తయ్యాయన్నారు. మళ్లీ ఇలా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో నగర సంఘటన కార్యదర్శి సాయికుమార్, చరణ్, హర్ష, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

వరికోతలో మెళకువలు పాటించాలి

కామేపల్లి: వరికోత సమయంలో రైతులు మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. మంగళవారం కామేపల్లిలో హార్వెస్టర్ ద్వారా చేపడుతున్న వరి కోతలను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పంట కోత అనంతరం ధాన్యాన్ని ఆరపెట్టి నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు అజ్మీర అర్జున్, నవీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● కేబుళ్లు అల్లకల్లోలం..



విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న కేబుల్ వైర్లు

నగరంలోని వైరా రోడ్డులో విద్యుత్ స్తంభం చుట్టూ కరెంటు, టెలికాం, ఇంటర్నెట్ కేబుళ్లు శాలిగూడు తరహాలో అలకల్లోలంగా వేలాడుతున్నాయి. నివాస ప్రాంతాలు, షాపింగ్ మాల్‌లు, వాణిజ్య సంస్థలు సమీపంలోనే ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ సంభవిస్తే పరిస్థితి ఏంటా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖతో పాటు టెలికాం సంస్థలు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఖమ్మంఅర్బన్